శుక్రవారం
10 ఏప్రిల్ 2026
సంపుటి: 18 సంచిక:85
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

# ప్రజాస్వామ్యం
తెలుగు దినపత్రిక
PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

RNI No. APTEL/2008/24928Postal Registration No.: VZM/22/2020-2022 Period of Renewal

## 'గ్రీన్ ఆశా' వచ్చేసింది


నవీ ముంబైకి సురక్షితంగా చేరకున్న ఎల్పీజీ నౌక
జేఎన్పీఏ పోర్టులో లంగర్ వేసిన ట్యాంకర్
హోర్ముజ్‌లో భారత
నావికులకు కేంద్రం కీలక అడ్వైజరీ జారీ




2 లో

# ఇంటికే పాస్‌పుస్తకం

-- ఎవరూ ట్యాంపర్ చేయలేరు
-- యజమాని అన్‌లాక్ చేస్తే తప్ప ఆ భూమిని ఎవరూ తీసుకోలేరు
-- రిజిస్ట్రేషన్ ప్రక్రియలోనూ సంస్కరణలు తీసుకొస్తాం : ముఖ్యమంత్రి చంద్రబాబు



బాపట్ల జిల్లా : 'రైతుల భూముల రికార్డులు ఎవరూ ట్యాంపర్ చేయకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రత కల్పిస్తున్నాం. క్యూఆర్ కోడ్‌తో మీ భూమి వివరాలు తెలుసుకునేలా ప్రత్యేకంగా ముద్రించాం. ఇ-పట్టాదారు పాస్‌పుస్తకాన్ని డిజిటల్‌గా లాకింగ్ చేసుకునే సౌలభ్యాన్ని కూడా కల్పించాం. భూ యజమానులు వచ్చి ఇకెవైసి, ఆధార్‌తో అన్‌లాక్ చేస్తే తప్ప ఆ భూమిని ఎవరూ తీసుకోలేరు' అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రైతులు ఇక తహశీల్దార్ కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా భూములు బదిలీ కాగానే, ఇంటికే పట్టాదారు పాస్‌పుస్తకం వచ్చేలా చూస్తామన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలోనూ సంస్కరణలను తీసుకురావాలని ఆలోచన చేస్తున్నామని, ఆటోమేటిక్ రిజిస్ట్రేషన్ జరిగేలా కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. బాపట్ల జిల్లా సూరేపల్లి గ్రామంలో 'మీ భూమి-మీ హక్కు' పట్టదార్ పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి గురువారం ఆయన హాజరయ్యారు. రైతు నాంచారయ్యకు పట్టాదారు పాస్‌పుస్తకాన్ని ముఖ్యమంత్రి అందించారు. ఈ సందర్భంగా ప్రజావేదిక సభలో చంద్రబాబు ప్రసంగిస్తూ, 2027 మార్చి నాటికి రీసర్వే 2.0 ప్రక్రియ పూర్తి చేసి 1.12 కోట్ల పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ పూర్తి చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 16,816 గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉందని, ఇప్పటికే 6,976 గ్రామాల్లో ఈ ప్రక్రియ పూర్తయిందని వివరించారు. ఇప్పటి వరకు 21.23 లక్షల పాస్‌పుస్తకాలు పంపిణీ చేశామని, జులై నాటికి మరో తొమ్మిది లక్షల పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ నెలలోనే 1,56,433 పాస్ పుస్తకాలు ఇచ్చామని, మరో 80 లక్షల పాస్‌పుస్తకాలు జారీ చేయాల్సి ఉందన్నారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఫీచర్లతో వీటిని జారీ చేస్తున్నామని, ఎవరూ తారుమారు చేసే అవకాశం లేకుండా రైతులకు భూ యాజమాన్య హక్కు పత్రాలను ఇస్తున్నామని తెలిపారు. ఇకెవైసి, ఆధార్

వివరాలు2లో..

## టీఎంసీతో అభివృద్ధికి ఆటంకం

వామపక్షాలు, కాంగ్రెస్ ఒకే కోవకు చెందినవి
రాష్ట్రంలో నందిగ్రామ్ ఫలితాలే పునరావృతం
పశ్చిమ బెంగాల్
ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ



కోల్‌కతా, : టీఎంసీ ప్రభుత్వం అభివృద్ధికి ఆటంకం కల్పిస్తున్నదని, ప్రైవేటు సెక్టార్లలో స్థానికంగా ఉన్న సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటు దారులకు అవకాశం కల్పిస్తున్నదని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్

వివరాలు2లో..

## నేడు వడగాడ్పుల జోరు

-సీమ, ఉత్తరాంధ్రలకు 'విపత్తుల' సంస్థ హెచ్చరిక-కోస్తాలో పలు ప్రాంతాల్లో వర్షాలు




అమరావతి : ఉత్తరాంధ్ర, రాయలసీమలలో శక్రవారం నాడు గరిష్ట ఉష్ణోత్రలు నమోదు కావడంతో పాటు, పెద్ద ఎత్తున వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఆ సంస్థ డైరక్టర్ ప్రఖర్ జైన్ గురువారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో విజయనగరం జిల్లా బాడంగి, బొబ్బిలి, తెర్లాం, వంగర మండలాలు, పార్వతీపురంమన్యం జిల్లా బలిజిపేట, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, పార్వతీపురం, సాలూరు, సీతంపేట, సీతానగరం మండలాలు, పోలవరం జిల్లా చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం, ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు

వివరాలు2లో..

## పుదుచ్చేరిలో 89.81 శాతం పోలింగ్

అస్సాంలో 85.38, కేరళలో 78.01 శాతం నమోదు
చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం
మరో నాలుగు స్థానాల్లో ప్రశాంతంగా ఉప ఎన్నికలు



అస్సాం/కేరళ/పుదుచ్చేరి,ఏప్రిల్9: అస్సాం, కేరళ, పుదుచ్చేరిలలో స్వల్ప చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం 7 గంటల కు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగిసింది. మూడు రాష్ట్రాల్లోని కొన్ని పోలింగ్ స్టేషన్లలో సమయం మించిపోయినా అప్పటికే ఓటర్లు క్యూలో ఉండటంతో వారికి ఓటువేసే అవకాశం కల్పించారుఅత్యధికంగా పుదుచ్చేరిలో 89.81 శాతం ఓటింగ్ నమోదు కాగా, అస్సాంలో 85.38శాతం, కేరళలో 78.01శాతం నమోదైంది. అస్సాంలో ఎన్నికల సంబంధిత హింసాకాండలో సుమారు 30 మంది గాయపడగా, ఏడుగురిని అరెస్టు చేశారు. శ్రీభూమి జిల్లాలోని పాతర్కండిలో కాంగ్రెస్, బీజేపీ మద్దతుదారుల మధ్య జరిగిన ఘర్షణలో సుమారు 25 మంది గాయపడగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పుదుచ్చేరిలోని మన్నడిపేటలో ఒక పోలింగ్ బూత్ వద్ద కాంగ్రెస్, బీజేపీ మద్దతుదారుల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు గుంపుపై లాఠీఛార్జ్ చేశారు. కేరళలో పినరయి హ్యాట్రిక్ కొట్టాలని ఆశిస్తుండగా, అస్సాంలో హిమంత మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమాగా ఉన్నారుపుదుచ్చేరిలో ఎన్. రంగ స్వామి ఐదోసారి అధికారాన్ని చేపట్టాలని చూస్తున్నారు. అస్సాం 126, కేరళ 140, పుదు చ్చేరి 30 మొత్తం 296 స్థానాలకు గాను పోలింగ్ జరిగింది. అస్సాంలో బీజేపీ, కాంగ్రె స్, కేరళలో లెఫ్ట్, కాంగ్రెస్, బీజేపీ, పుదు చ్చేరిలో ఎన్డీయే, డీఎంకే కూటముల మధ్య పోటీ నెలకొంది. మే 4న ఫలితాలను ప్రకటిం చనున్నారు. కాగా మరో మూడు రాష్ట్రాల్లోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లోనూ ఉప ఎన్నికలు జరిగాయి. నాగాలాండ్‌లోని కోరిడాంగ్, త్రిపురలోని ధర్మనగర్, కర్ణాటకలోని బాగల్‌కో ట్, దావణగిరె సౌత్‌లో ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించారు. ఈ నియోజకవర్గాలలో సిట్టిం గ్ ఎమ్మెల్యేలు మృతి చెందడంతో ఎన్నికలు నిర్వహించారు.

## హిజ్బుల్లా కీలక నేత హతం

- లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు
- హజ్బుల్లా చీఫ్ నయీమ్ ఖాసీం పర్సనల్ సెక్రటరీ అలీ యూసఫ్ హర్షీ మృతి: ఐడీఎఫ్
- ఒక్క రోజులో 254 మంది మృతి.. 1,165 మందికి పైగా గాయాలు
- పూర్తిగా ఒప్పందం అమలయ్యే వరకు అక్కడే మా సైన్యం



బీరుట్/టెహ్రాన్/వాషింగ్టన్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: లెబనాన్‌లో ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడుల్లో హిజ్బుల్లా చీఫ్ నయీమ్ ఖాసీం అల్లుడు, పర్సనల్ సెక్రటరీ అలీ యూసఫ్ హర్షి మృతి చెందాడు. ఈ మేరకు ఐడీఎఫ్ ప్రకటించింది. ఈ దాడుల్లో లెబనాన్‌లో ఒక్క రోజే 254 మందికి పైగా మరణి ంచగా, మరో 1,165 మందికి పైగా గాయపడ్డారు. మరోవైపు పూర్తి కాల్పుల విరమణ పూర్తి ఒప్పందం అమలయ్యే వరకూ ఇరాన్ చుట్టూ అమెరికా సైన్యం, యుద్ధనౌకలు ఉం టాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇంకోపక్క సీజ్ ఫైర్ విఫలమైతే అమెరికాదే పూర్తి బాధ్యత అని ఇరాన్ స్పష్టం చేసింది.ఇదిలా ఉంటే పాక్ మధ్యవర్తిత్వంపై తమకు నమ్మకం లేదని భారత ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ లెబనాన్‌పై భీకర దాడులు చేస్తోంది. హిజ్బుల్లా చీఫ్ పర్సనల్ సెక్రటరీ అలీ యూసఫ్ హర్షీని హతమార్చినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ గురువారం ప్రకటించింది. బుధవారం రాత్రి బీరుట్‌పై జరిపిన దాడుల్లో అలీ యూసఫ్ చనిపోయారని.. హిజ్బుల్లా ఆయుధ రవాణా మా ర్గాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ వెల్లడించిందిసౌత్ లెబనాన్‌లో 10 ఆయుధ డిపోలు నాశనం నాశనమైనట్లు పేర్కొంది. హర్షీ.. ఖాసిమ్‌కు

వివరాలు2లో..

## పశ్చిమాసియా ప్రభావం
## భారత్‌పై పరిమితమే

2026-27లో వృద్ధి
6.6%ప్రపంచ బ్యాంక్ అంచనా



2 లో

# హోర్ముజ్‌లో నౌకలు వెనక్కి!

హోర్ముజ్‌లో నౌకలు వెనక్కి!
జలసంధిని మళ్లీ మూసేసిన ఇరాన్
సముద్రంలోనే 1000కి పైగా నౌకలు




టెహ్రాన్, ఏప్రిల్ 9: అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ కుదిరాక కూడా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను కొనసాగిస్తుండటంతో గల్ఫ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. లెబనాన్‌పై దాడులకు నిరసనగా ఇరాన్ మళ్లీ హోర్ముజ్‌ను మూసివేసినట్టు ప్రకటించింది. ఈ నేపథ్యంలో సరకు రవాణా నౌకల రాకపోకలకు మళ్లీ అంతరాయం ఏర్పడినట్టు, హోర్ముజ్ వైపు ప్రయాణిస్తున్న అనేక సరకు రవాణా నౌకలు వెనక్కు మళు ్లతున్నట్టు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వెలువడుతున్నాయి కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత మారిటైమ్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. గ్రీన్‌కు చెందిన

వివరాలు2లో..

## కాళేశ్వరానికి మరమ్మతులు

ఏజెన్సీలన్నింటినీ అప్రమత్తం చేసి
పనుల్లో వేగం పెంచాలి
అధికారులకు
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
సమీక్షలో పాల్గొన్న మంత్రి
ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



2 లో

# 'గ్రీన్ ఆశా' వచ్చేసింది

ముంబై, ఏప్రిల్ 9: పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలతో అత్యంత ఆంక్షలు కొనసాగుతున్న హోర్ముజ్ జలసంధిని భారతీయ జెండా కలిగిన 'గ్రీన్ ఆశా' ఎల్పీజీ నౌక కొన్ని రోజుల క్రితమే దాటి భారత్ వైపు కదిలింది. 15,400 టన్నుల లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ)తో ఈ వస్తున్న ఈ నౌక గురువారం నవీ ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ (జేఎన్పీఏ)కి సురక్షితంగా చేరుకుందిజేఎన్పీఏలోని భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), ఇండియన్ ఆయి ల్ (ఐఓసీఎల్) నిర్వహిస్తున్న లిక్విడ్ బెర్త్‌లో లంగరు వేసింది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం ప్రారంభమైన తర్వాత జేఎన్పీఏకు చేరుకున్న మొట్టమొదటి ఎల్పీజీ నౌక ఇదే కావడంతో దీనిని ఒక ముఖ్యమైన మై లురాయిగా అధికారులు పేర్కొన్నారు. ఈ నౌకలోని సిబ్బంది, కార్గో అంతా సురక్షితం గా ఉన్నట్లు జేఎన్పీఏ ఒక ప్రకటనలో తెలిపింఇటీవల ఉద్రిక్తతలు మొదలైనప్పటి నుంచి హర్మూజ్ జలసంధిని దాటిన ఎనిమి దో భారత నౌక 'గ్రీన్ ఆశా'. క్లిష్టమైన భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లోనూ దేశానికి అవ సరమైన నిత్యావసర సరుకుల సరఫరాను నిరంతరాయంగా కొనసాగించే భారత స ముద్ర రవాణా సామర్థ్యానికి ఈ సంఘటన నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నౌక రాకతో దేశీయ ఎల్పీజీ సరఫరా వ్యవస్థకు మరింత భరోసా లభించినట్లయింది.ఇరాన్, అమెరికా – ఇ జ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ జలసంధి వద్ద చిక్కుకుపోయిన భారత నావికులకు కేంద్రం కీలక అడ్వైజరీ జారీ చేసింది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఒక ప్రకటనను వి డుదల చేసింది.

# కాళేశ్వరానికి మరమ్మతులు

హైదరాబాద్, : తెలంగాణలో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు కాళేశ్వరంలోని మూడు బరాజ్‌లకు తక్షణమే మరమ్మతులు చేసి, వీలైనం త త్వరగా వినియోగంలోకి తీసుకురావాల ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులను పూర్తి చేయాలన్నారు. వీలైనంత త్వరగా ఈ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారుజూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో గురువారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించారు. మరమ్మతుల కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించి, నిరంతరం పర్యవేక్షణ చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీనికి సంబంధించిన ఏజెన్సీలన్నింటినీ అప్రమత్తం చేసి పనుల్లో వేగం పెంచాలని ఆయన సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తిచేయాలని సీఎం స్పష్టం చేశారు.నీటిపారుదల శాఖ, సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టేషన్స్‌తో టీమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పనిలో సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) సభ్యులు ఉండేలా చూడాలన్నారు. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కిలో మీటర్ల బ్యారేజ్‌ని అధ్యయనం చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మేడిగడ్డ దగ్గర 500 బోరు బావులు తొవ్వాల్సి ఉందని, ఇందుకోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారఇందుకు కావాల్సిన యంత్రాలను సమకూర్చుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా ఈ పని పూర్తిచేయాలని ఆదేశించారు. మరమ్మతులకు సంబంధించి డిజైన్‌లు సిద్ధం చేయాలని సూచించారు. డిసెంబరు వరకు చేయాల్సిన పనులపైన పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలన్నారు. పనులలో జాప్యం జరగడానికి వీలు లేదన్న సీఎం, నిధుల విషయంలో ఇబ్బంది కలుగనివ్వబోమని స్పష్టం చేశారు.మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు ప్రారంభం అయ్యాక తాను స్వయంగా వచ్చి పరిశీలిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమా వేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మకృష్ణారావు, ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్, సీఎం కార్యదర్శి మానిక్‌రాజ్, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## పశ్చిమాసియా ప్రభావం భారత్‌పై పరిమితమే

దిల్లీ: విదేశీ మారకపు నిల్వలు అధికంగా ఉండటం, ఆర్థిక వెసులుబాటు, తక్కువ ద్రవ్యోల్బణం వంటి అంశాలతో ప్రస్తుత ఇంధన సంక్షోభాన్ని తట్టుకునే స్థాయిలో భారతదేశం ఉందని ప్రపంచ బ్యాంక్ గురువారం తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2026–27) భారత జీడీపీ వృద్ధి అంచనాలను 6.6 శాతానికి పెంచిన ఒక రోజు తర్వాత, ప్రపంచ బ్యాంక్ ఈ వ్యాఖ్యలు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య సంక్షోభాన్ని భారత్ సమర్థంగా ఎదుర్కొందని, చమురు మార్కెట్లలో అస్థిరతకు దారితీసిన ప్రస్తుత పశ్చిమాసియా సంక్షోభంలోనూ భారత ఆర్థిక వ్యవస్థ బలమైన స్థితిలో ఉందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. 'భారతదేశానికి స్థిర విధానాలు, అధిక విదేశీ మారకపు నిల్వలు, అవసరమైనప్పుడు మద్దతు అందించగలిగే ఆర్థిక వెసులుబాటు, తక్కువ ద్రవ్యోల్బణం ఉన్నాయి. ఐరోపా సమాఖ్య (ఈయూ)తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ), కొత్త కార్మిక విధానం వంటి స్థూల సానుకూల విధానాలు బలమైన వృద్ధి వేగానికి మద్దతు ఇస్తున్నాయి. అందుకే ఇతర వర్ధమాన మార్కెట్లతో పోలిస్తే భారత్ బలమైన, స్థూల పని తీరు కనబరిచే ప్రాంతంగా కొనసాగుతుందని మేము భావిస్తున్నామ'ని ప్రపంచ బ్యాంక్ రీజినల్ ప్రాక్టీస్ డైరెక్టర్, ప్రాస్పెరిటీ, ఫర్ సౌత్ ఏషియా – సెబాస్టియన్ ఎకార్డ్ వెల్లడించారు. 'సౌత్ ఏషియా ఎకనామిక్ అప్‌డేట్' పేరుతో ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. బలమైన దేశీయ గిరాకీ, ఎగుమతుల కారణంగా భారత వృద్ధి 2024–25లో 7.1% కాగా, 2025–26లో 7.6 శాతానికి చేరింది. 2026–27లో వృద్ధి 6.6 శాతానికి తగ్గుతుందని అంచనా వేసినా, ఇది జనవరిలో విడుదల చేసిన 'గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్' నివేదికలో పేర్కొన్న 6.5 శాతం కంటే ఎక్కువగా ఉంది.

# హోర్ముజ్‌లో నౌకలు వెనక్కి!

మొదటి పేజీ తరువాయి

బల్క్ క్యారియర్ ఎన్‌జే ఎర్త్, లైబీరియా జెండా కలిగిన డేటోనా బీచ్ అనే రెండు నౌకలు హోర్ముజ్‌ను దాటాయి. ఈ క్రమంలో అరోరా అనే చమురు నౌక కూడా జలసంధిని దాటేందుకు సిద్ధమైంది. అయితే అప్పటికే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండడంతో ఇరాన్ హోర్ముజ్‌ను పూర్తిగా మూసేసిందిదీంతో జలసంధిని దాటేందుకు తొలుత ముందుకెళ్లిన ఈ నౌక ముసందం తీరం వద్ద వెనక్కు మళ్లింది. దీంతోపాటు మరికొన్ని నౌకలు కూడా ఇలానే వెనుదిరిగినట్లు అంతర్జాతీయ మీడియా తెలిపింది. ఇప్పటికే చైనాకు చెందిన కొన్ని సరకు రవాణా నౌకలు హోర్ముజ్‌ను దాటేందుకు వేచి చూస్తున్నట్టు కూడా మీడియాలో కథనాలు వెలువడ్డాయి. చైనా ప్రభుత్వ షిప్పింగ్ సంస్థ కాస్కోతో పాటు మరో సంస్థ హీ రాంగ్ హాయ్‌కు చెందిన నౌకలు హోర్ముజ్ జలసంధికి కొద్ది దూరంలో పర్షియన్ గల్ఫ్ జలాల్లో వేచి చూస్తున్నట్టు సమాచారంఇదిలా ఉంటే మంగళవారం నాటికి సరకుతో ఉన్న 187 ట్యాంకర్లు సహా 1000కి పైగా నౌకలు హోర్ముజ్ సమీపంలోనే ఉన్నాయని క్లెప్లర్ పేర్కొంది. పరిస్థితులు కుదటపడి, సాధారణ రాకపోకలు ప్రారంభమైనా ఈ నౌకలు జలసంధిని దాటేందుకు రెండు వారాలకు పైనే పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. హోర్ముజ్ జలసంధి ద్వారా ప్రయాణించే నౌకల కోసం ఇరాన్ ప్రత్యామ్నాయ మార్గాలను ఇరాన్ ప్రకటించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా, దాని మిత్రదేశాల నౌకలను అడ్డుకోవడానికి ఇరాన్ జలసంధిలో సీమైన్స్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం నౌకలు ఆ సీమైన్స్ బారిన పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను వెల్లడించింది. సముద్ర భద్రతా నియమాలకు అనుగుణంగా సీమైన్స్ నుంచి తప్పించు కోవడానికి హోర్ముజ్ లో నౌకలు ప్రత్యామ్నాయ మార్గాలు తీసు కోవాలని ఐఆర్‌జీసీ ప్రకటించినట్లు సమాచారంఅయితే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో సీజ్‌ఫైర్ బెడిసికొట్టి, పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చేలా ఉంది. అమెరికాతో ఒప్పందం ప్రకారం.. హోర్ముజ్‌ను తెరిచిన టెహ్రాన్.. లెబనాన్‌పై దాడులకు ప్రతీకారంగా జలసంధిని మళ్లీ మూసేసింది. కాల్పుల విరమణ నుంచి వైదొలుగుతామని హెచ్చరించింది. ఈ జలసంధిపై అంతా గందరగోళ పరిస్థితి నెలకొంది.

# ఇంటికే పాస్‌పుస్తకం

మొదటి పేజీ తరువాయి

అనుసంధానంతో ఇ–రికార్డును పటిష్టంగా తయారు చేసి పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. రూ.10 లక్షలలోపు విలువైన వారసత్వ భూములను వంద రూపాయలకు, అంతకంటే ఎక్కువ విలువైన వారసత్వ భూములను వెయ్యి రూపాయలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని తెలిపారు. జాయింట్ ఎల్‌పిల విషయంలో వివాదాలు తెచ్చుకోవద్దని, అనవసరపు కేసులు లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. తల్లినీ, చెల్లినీ ఆస్తి కోసం మోసం చేస్తోన్న వ్యక్తిని ఆదర్శంగా తీసుకోవద్దన్నారు. పొలం గట్లు, ఇంటి హద్దుల విషయంలో లేనిపోని కక్షలు, వివాదాలు వద్దని సూచించారు. రెవెన్యూ శాఖలో కొందరు వ్యక్తుల వల్లే సమస్యలు వస్తున్నాయన్నారు.

2019–24 మధ్య జరిగిన వ్యవహారాల వల్ల పెద్ద ఎత్తున భూవివాదాలు వచ్చాయని, కూటమి అధికారంలోకి వచ్చాక ప్రజల నుంచి వచ్చిన అర్జీల్లో ఎక్కువ శాతం రెవెన్యూ వ్యవహారాలేనని, అందుకే శాశ్వతంగా భూ సమస్యను పరిష్కరించి భూమిపై పూర్తి హక్కు కల్పించాలని 'మీ భూమి– మీ హక్కు' కార్యక్రమం చేపట్టామని వివరించారు. రైతుల పొలాల్లోకి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, బాపట్ల ఎంపి పి.తెన్నేటి కృష్ణ ప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, సిసిఎల్ఎ ప్రత్యేక కార్యదర్శి జి.జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట తదితరులు పాల్గొన్నారు.

# నేడు వడగాడ్పుల జోరు

మొదటి పేజీ తరువాయి

మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. అదే సమయంలో తెలంగాణ, రాయలసీమ, అంతర తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

వడగాడ్పులు వీచే ప్రాంతాల్లో మహిళలు, పిల్లలు, వద్దులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజలు డీహైడ్రేట్ కాకుండా ఉండటానికి ఒఆర్ఎస్, ఇంట్లో తయారుచేసిన పానీయాలైన లస్సీ, నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు మొదలైనవి త్రాగాలని,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

# హిజ్బుల్లా కీలక నేత హతం

మొదటి పేజీ తరువాయి

అత్యంత నమ్మకస్థుడైన సలహాదారు మాత్రమే కాకుండా.. అతని కార్యాలయ నిర్వహణ, భద్రతా వ్యవహారాల్లో కీలకపాత్ర పోషించేవారని తెలిపింది. అమెరికా– ఇరాన్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లం ఘించిందని దానికి ప్రతిచర్యగా ఇజ్రాయెల్‌పై రాకెట్లతో దాడి చేసినట్లు ఇరాన్ మద్దతు ఉన్న హిజ్బుల్లా ప్రకటించిన సంగతి తెలిసిందేలెబనాన్ అంతటా ఇజ్రాయెల్ దాడులకు సమాధానం ఇచ్చే హక్కు తమకు ఉందని హిజ్బుల్లా పేర్కొంది. లెబనాన్‌పై కేవలం ఒక్క రోజులోనే ఇజ్రాయెల్ దాడుల్లో 254 మంది మరణించగా.. మరో 1,165 మందికి పైగా గాయపడ్డారు. కాగా లెబనాన్ నుంచి ఉత్తర ఇజ్రాయెల్‌పై హిజ్బు ల్లా సుమారు 30 రాకెట్లను ప్రయోగించిందని ఇజ్రాయెల్ రక్షణ దళాలు తెలిపాయి. పాకిస్థాన్ పాత్రపై సందేహంఅమెరికా, –ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణకు సంబంధించిన చర్చల్లో పాకిస్థాన్ పాత్రపై ఇజ్రాయెల్ సందేహం వ్యక్తంచేసింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంపై తమకు నమ్మకం లేదని పేర్కొంది. భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒప్పందం పూర్తిగా అమలయ్యే వరకు మా సైన్యం అక్కడే: ట్రంప్ పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించడం కోసం కాల్పుల విరమణ ఒప్పందం జరిగినా.. అనేక ప్రాంతాల్లో దాడులు జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాలపై తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం ముగింపునకు సంబంధించి పూర్తిస్థాయి ఒప్పందం అమలయ్యే వరకు తమ దేశ యుద్ధ నౌకలు, సైన్యం ఇరాన్, దాని చుట్టూ ఉండే ప్రాంతాల్లోనే ఉంటాయని స్పష్టం చేశారు.ఒక వేళ ఒప్పందాన్ని అతిక్రమిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, మునుపెన్నడూ చూడనంత స్థాయిలో విధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ఈ లోగా అమెరికా సైన్యం విశ్రాంతి తీసుకుంటూ.. తమ తదుపరి మిషన్ కోసం ఎదురు చూస్తుంటుందన్నారు. ఇరాన్ వద్ద ఎట్టి పరిస్థితుల్లో కూడా అణ్వాయుధాలు ఉండొద్దని, హోర్ముజ్‌ను తెరిచి, దాన్ని సురక్షితంగా ఉంచాలని ట్రంప్ తన ట్రూత్‌లో పేర్కొన్నారు.మేం హిజ్బుల్లాపై దాడులు కొనసాగిస్తాం : నెతన్యాహు అమెరికా, – ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణలో లెబనాన్ భాగం కాదని ఇజ్రాయెల్ ప్రధాని స్పష్టం చేశారు. బుధవారం రాజధాని



బీరుట్‌లో జరిపిన వైమానిక దాడుల్లో, హిజ్బుల్లా నాయకుడు నయీమ్ ఖాసెమ్ కార్యదర్శి, ఆయన మేనల్లుడు అలీ యూసుఫ్ హర్షీని హతమార్చినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు.'మేము హిజ్బుల్లాపై బలంతో, కచ్చితత్వంతో, దృఢ నిశ్చయంతో దాడులు కొనసాగిస్తున్నాం. బీరుట్‌లో, హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థ సెక్రటరీ–జనరల్ నయీమ్ ఖాసెమ్ వ్యక్తిగత కార్యదర్శి, అతనికి అత్యంత సన్నిహితులలో ఒకరైన అలీ యూసుఫ్ ఖర్షీని మేము హతమార్చాం.రాత్రికి రాత్రే ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) హిజ్బుల్లాలో వేలాది ఆయుధాలు, రాకెట్లు, లాంచర్లను తరలించడానికి ఉపయోగించే క్రాసింగ్స్‌లు, అలాగే ఆయుధ డిపోలు, లాంచర్లు, హిజ్బుల్లా ప్రధాన కార్యాలయాలపై దాడి చేసింది' అని ఆయన తెలిపారు. ఇజ్రాయెల్ పౌరులకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై దెబ్బ కొడతాం అని ఆయన శపథం చేశారుఒప్పందం విఫలమైతే అమెరికాదే బాధ్యత : ఇరాన్కాల్పుల విరమణకు అంగీకారం కుదిరినా ఇరాన్ మద్దతు పక్షాలపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. దీంతో ఈ దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండిస్తోంది. ఇలాంటి సందిగ్ధ పరిస్థితుల్లో శాశ్వత శాంతి ఒప్పందం అసమంజసమే అవుతుందని వెల్లడించింది. సీజ్‌ఫైర్‌లోని అనేక షరతులను నెతన్యాహు ప్రభుత్వం ఉల్లంఘించిందని ఆగ్రహించింది. ఇరాన్ హిజ్బుల్లాకు మద్దతుగా నిలుస్తుందని ఐఆర్‌జీసీ స్పష్టం చేసింది. సీజ్‌ఫైర్ విఫలమైతే ఆ బాధ్యత అమెరికాదే అని ఇరాన్ హెచ్చరించింది.

# టీఎంసీతో అభివృద్ధికి ఆటంకం

మొదటి పేజీ తరువాయి

మోసాలు, పాపాలు అంతా కాదని, వందేళ్లు గడిచినా తొలగిపోవని ప్రధాని ఆగ్రహం వ్యక్తంచేశారు. వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలను కూడా బెంగాల్ విశ్వసించిందని ఈ పార్టీలన్నీ ఒకే కోవకు చెందినవని విమర్శించారు. ఇక్కడి ప్రజల కలలను, ఆకాంక్షలను అణచివేశాయన్నారుగురువారం అసన్‌సోల్, బీర్‌భూమి, హల్దియాలో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని టీఎంసీని లక్ష్యం గా చేసుకున్నారు. ఐదేళ్ల క్రితం నందిగ్రామ్‌లో ఫలితమే పశ్చిమ బెంగాల్ అంతటా పునరావృతం కాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ అమలు చేస్తామని చెప్పారు. శరణార్థులకు రాజ్యాంగబద్ధంగా ప్రత్యేక హక్కుల ను కల్పిస్తామని, చొరబాటుదారులను దేశం నుంచి తరిమికొడతామని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే 7వ వేతన కమిషన్ అమల్లోకి తీసుకొస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు హామీ ఇచ్చారు.

### ఆకాంక్షలకు ప్రతిబింబం

# మహిళా రిజర్వేషన్ చట్టం

న్యూఢిల్లీ, : మహిళా రిజర్వేషన్ చట్టానికి ప్రతిపాదిత సవరణలు కేవలం శాసనపరమైన ప్రక్రియ మాత్రమే కాదని, భారతదేశ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది మహిళల ఆకాంక్షలకు ప్రతిబింబమని ప్రధా ని నరేంద్ర మోదీ అన్నారు. 'నారీ శక్తి వంద న అధినియమ్' (మహిళా రిజర్వేషన్ చట్టం) ఆమోదించేందుకు ఏప్రిల్ 16 నుంచి 18 వరకు మూడు రోజులపాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారుఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఎక్స్'లో సందేశమిచ్చారు. భారత ప్రజాస్వామ్యాన్ని మరింత చైతన్యవంతంగా, భాగస్వామ్యంతో కూడినదిగా మార్చేందుకు శాసనసభలలో మహి ళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం అత్యవసరమన్నారు. రిజర్వేషన్‌లో ఆలస్యం చేయడం తగదన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలు మహిళా రిజర్వేషన్‌తోనే నిర్వహించాలని తమ అభిమతమని చెప్పారుమహిళలకు రిజర్వేషన్ అంశంపై ఎన్ని ప్రయత్నాలు జరిగినా అవి కార్యరూపం దాల్చలేదని, సమాజం పురోగమిస్తున్న తరుణంలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యతనీయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే నిబంధనను 2023లో రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా తీసుకువచ్చారు. 2027 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన పూర్తయిన తరువాతే అమల్లోకి వస్తుంది. ప్రస్తుతమున్న లోక్‌సభ సీట్లను 816కు పెంచనున్నారు. ఇందులో 273 స్థానాలను మహిళలకు కేటాయించనున్నారు.

# గతేడాది కంటే మెరుగు

### జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకం -- 'శ్రీశైలం'లో 42.60, తుంగభద్ర'లో 16.62 టిఎంసిల నీరు



కర్నూలు : తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల 2024లో అడుగంటిన జలాశయాలు, 2025లో సమృద్ధిగా కురిసిన వర్షాలతో ప్రస్తుతం ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. గతేడాది జూన్ మొదటి వారంలోనే నైరుతి రుతుపవనాలు ప్రవేశించి రాష్ట్ర వ్యాప్తంగా మంచి వర్షాలు కురవడంతో జలాశయాల్లోకి భారీగా వరద నీరు చేరింది. ఫలితంగా సాధారణంగా ఏప్రిల్ రెండో వారంలో డెడ్ స్టోరేజీకి చేరువయ్యే ప్రాజెక్టుల్లో ఈసారి నీటి నిల్వలు గతేడాది కంటే మెరుగ్గా ఉన్నాయి. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టిఎంసిలు. డెడ్ స్టోరేజీ 34 టిఎంసిలు. గతేడాది ఇదే రోజున ప్రాజెక్టులో 40.20 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం 42.60 టిఎంసిలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నీటిమట్టం 885 అడుగులు. గతేడాది ఇదే రోజున 819.10 అడుగులు నమోదు కాగా, ప్రస్తుతం 822.30 అడుగులు ఉంది. ప్రస్తుతం శ్రీశైలానికి ఎటువంటి ఇన్‌ఫ్లో లేదు. కుడి, ఎడమ విద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ఆపేశారు.కృష్ణా నది ఎగువన కురిసిన వర్షాలు, తుంగభద్ర పరివాహక ప్రాంతాల్లో వచ్చిన వరదల వల్ల తుంగభద్ర జలాశయంలోనూ నిల్వలు పెరిగాయి. ప్రస్తుతం ఎల్‌ఎల్‌సి, హెచ్‌ఎల్‌సిలకు అప్పుడప్పుడూ నీటిని వదులుతున్నారు. తుంగభద్ర జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.78 టిఎంసిలు. గతేడాది ఇదే సమయానికి 7.31 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం 16.62 టిఎంసిల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. గరిష్ట నీటిమట్టం 1633 అడుగులు. గతేడాది ఇదే సమయానికి 1584.98 అడుగులుగా నమోదైంది. ప్రస్తుతం 1595.85 అడుగుల మేర ఉంది. గత వర్షాకాలంలో వచ్చిన భారీ ప్రవాహాలు, మెరుగైన వర్షపాతం ప్రస్తుత ఎండాకాలంలోనూ నీటిమట్టాలు ఆశాజనకంగా ఉండడానికి ప్రధాన కారణమని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. తాగునీటి అవసరాలకు ఈ నిల్వలు ఎంతో ఊరటనిస్తాయని భావిస్తున్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా నీటి వినియోగంపై నియంత్రణ అవసరమని వారు అంటున్నారు. గతేడాది ఆగస్టు పదిన తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో, గత రబీలో జనవరి 15 నుంచే నీటి విడుదలను నిలిపివేశారు. ప్రస్తుతం డ్యాం గేట్ల మార్పు పనులు పూర్తయ్యాయి. రబీ ఆయకట్టుకు నీటిని మూడు నెలల ముందే నిలిపివేయడం వల్ల కూడా నీటి నిల్వ గతేడాది కంటే ఎక్కువగా ఉంది.

# జిల్లా అభివృద్ధి ప్రతిపాదనలకు సీఎం సానుకూల స్పందన

---ప్రజా సంతృప్తిలో జిల్లాకు 4వ స్థానం జిల్లా కలెక్టర్ - ఎస్.రాంసుందర్ రెడ్డి

ప్రజాస్వామ్యం /విజయనగరం: జిల్లా అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ప్రతిపాదనల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన జిల్లా





సమీక్షా సమావేశం వివరాలను కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుండి ప్రాజెక్టులు, సాగునీటి కాలువలు, రహదారులు, ఆసుపత్రులు మరియు విద్యాసంస్థల బలోపేతానికి సంబంధించి సుమారు 30 కీలక ప్రతిపాదనలు అందాయని, వీటిపై ప్రజాప్రతినిధులతో చర్చించి, సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు.పరిపాలనకు సంబంధించి ప్రజల సంతృప్తి స్థాయిలో విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే నాలుగో ర్యాంకు సాధించిందని కలెక్టర్ ఈ సందర్భంగా వెల్లడించారు. మరింత మంచి ర్యాంకు సాధించాలన్నారని తెలిపారు. విద్యుత్, ఏపీఎస్ఆర్టీసీ, రిజిస్ట్రేషన్ల వంటి శాఖల్లో సేవల నాణ్యతను మరింత పెంచాలని సీఎం సూచించారని చెప్పారు. ముఖ్యంగా భోగాపురం విమానాశ్రయం నుండి విజయనగరం వరకు 'అవుటర్ రింగ్ రోడ్డు' నిర్మాణానికి సంబంధించి వీఎంఆర్‌డీఏ అధికారులతో చర్చించి త్వరితగతిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారుఈ సమావేశంలో జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఎమ్మెల్యేలు కిమిడి కళావెంకటరావు, కోండ్రు మురళీమోహన్, కోళ్ల లలితకుమారి, బేబీ నాయన, పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం నాగమాధవి తదితరులు పాల్గొన్నారు.

## మధుపాడులో టేకుతోట దగ్ధం



ప్రజాస్వామ్యం/ గజపతినగరం: మండలంలోని మధుపాడ గ్రామ సమీపానగల రెండు ఎకరాల టేకు తోటలో సంభవించిన అగ్నిప్రమాదంలో రెండు ఎకరాల తోట దగ్ధమైంది. ఈ ప్రమాదంలో లక్ష రూపాయలు వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. కాల్చిన సిగరెట్ , బీడీ పారివేయడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు అగ్నిమాపక అధికారి ప్రసాదు విలేకరులకు తెలిపారు.

## పోలీస్ స్టేషన్లలలో ఆంధ్రజ్యోతి ఎం.డి వేమూరి.రాధాకృష్ణ పై వైసీపీ నాయకులు ఫిర్యాదు



ప్రజాస్వామ్యం/సాలూరు ఏప్రిల్ 9: వైసీపీ నాయకుల మనోభావాలు దెబ్బతీసేలా,మహిళలను కించపరిచేలా,సభ్య సమాజం తలదించుకునేలా అసభ్యకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆంధ్రజ్యోతి,ఏబీఎన్ వేమూరి.రాధాకృష్ణ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆంధ్రజ్యోతి ఎం.డి అయిన రాధాకృష్ణ పై కేసు నమోదు చేయాలని కోరుతూ ఈరోజు సాలూరు పట్టణ స్టేషన్లో సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.అప్పల నాయుడు రూరల్ పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్ రవీంద్ర రాజా గారికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఫిర్యాదు చేశారు.ఇలాంటి అసభ్యకర వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు.ఇలాంటి వ్యాఖ్యలపై వెంటనే కఠిన చర్యలు తీసుకుని కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు.ఈ కార్యక్రమంలో సాలూరు పట్టణ రూరల్ ప్రాంతాల వైసీపీ నాయకులు,కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏబీఎన్ రాధాకృష్ణపై భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



భీమునిపట్నం ప్రజాస్వామ్యం మహిళలను కించపరిచేలా ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ ఏబీఎన్ లో కొత్త పలుకు పేరుతో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్ రెడ్డిని పార్టీని ముఖ్యంగా పార్టీ నాయకుల భార్యల పై అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా భీమునిపట్నం మండల అధ్యక్షులు ఎం.పి.పి డి.వి.ఎస్.ఎస్.ఎన్. రాజు (వాసు రాజు) ఆధ్వర్యంలో భీమిలి పోలీస్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు అనంతరం భీమిలి సి.ఐ తిరుమల రావు ఏబీఎన్ రాధాకృష్ణపై కంప్లైంట్ ఇచ్చారు ఈ కార్యక్రమంలో భీమిలి మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షులు గాడు శ్రీను, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, 4వ వార్డ్ మాజీ కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు,అక్కరమాని రామానాయుడు,శిల్లా కరుణాకర్ రెడ్డి, జీవీఎంసీ1,2,3,4 వార్డుల అధ్యక్షులు- జగ్గుపల్లి ప్రసాద్, చిల్ల భాస్కర్ రెడ్డి, అల్లిపిల్లి నరసింగరావు, పాల రమణారెడ్డి, భీమిలి అధికార ప్రతినిధి బింగి హరి కిరణ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, మాజీ కౌన్సిలర్లు కదిరి ఎల్లాజీ, స్వర్ణలత, మైలపల్లి లక్ష్మణ్ రావు, వాసుపల్లి కొండబాబు, కొండ్రు రామ సూరప్పుడు, బూర నాగరాజు, ఎ. సూర్య ప్రకాష్,ముక్కి కృష్ణ,రాంబుక్త ప్రభాకర్ నాయుడు, శిల్లా వంశీ రెడ్డి, చెల్లూరి గౌరీ నాయుడు, బోర రామకృష్ణ, బాకీ రమణారెడ్డి, వాడు మొదల జగ్గారావు, మేరుగు చిన్నారావు, బోని సంజీవరావు, బోని శ్రీను, కుంకుపూడి ఎర్రిబాబు, బర్రి రాజు మండల జీవీఎంసీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై రాధాకృష్ణ అనుచిత వ్యాఖ్యలు అమానుషం

మాజీ ఎమ్మెల్యే - బొత్స అప్పలనరసయ్య -స్థానిక గజపతినగరం పోలీస్ స్టేషన్లో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య





ప్రజాస్వామ్యం/గజపతినగరం: ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి ఎం.డి రాధాకృష్ణ కొద్దిరోజుల క్రితం వైసీపీ నేతల భార్యలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, పత్రికలో వ్రాయడం , "కొత్త పలుకు" అనే పేరుతో చెత్త మాటలు వ్రాయడం అమానుషమని వైకాపా పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన రాధాకృష్ణ పై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బొత్స డిమాండ్ చేశారు . సభ్య సమాజం తలదించుకునే విధంగా రాధాకృష్ణ చేసి న వ్యాఖ్యలు రాష్ట్రంలో ప్రజలకు అందరూ చూశారని బొత్స అన్నారు .ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం నాడు మాజీ ఎమ్మెల్యే బొత్స ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి ఎం.డి రాధాకృష్ణ పై ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు . స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బొత్స విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రం విడిపోయి 12 సంవత్సరాలు అయింది .రాజధాని లేకుండా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఉంది. రెండు లక్షల కోట్లతో అమరావతిని రాజధానిగా నిర్మించాలంటే అనేక దశాబ్దాలు పడుతుంది. ఇది అసాధ్యం అని జగన్ ఎప్పుడో చెప్పారని అన్నారు. అలా కాకుండా ఇప్పటికే అభివృద్ధి చెందిన మచిలీపట్నం ,విజయవాడ ,గుంటూరు( మావిగన్) ప్రాంతానికి 20 వేల కోట్లు రూపాయలతో కనెక్టివిటీ ఇస్తే అద్భుతమైన రాజధాని ఏర్పాటు జరుగుతుందని అధినేత జగన్ చెప్పిన విషయాన్ని బొత్స గుర్తు చేశారు. దానికి వక్ర భాష్యం చెబుతూ రాధాకృష్ణ మహిళలను కించపరిచే విధంగా మాట్లాడారని బొత్స అన్నారు .ఏ విధంగా జర్నలిజం ముసుగులో రాధాకృష్ణ రాతలు వ్రాస్తున్నారు అన్నది ప్రజలందరూ ఒకసారి ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉంది అని బొత్స అన్నారు . జర్నలిజం ముసుగులో ఏ విధంగా రాధాకృష్ణ అభివృద్ధి చెందినది, ఏ విధంగా పత్రికను అడ్డు పెట్టుకొని వ్యాపారం చేస్తున్నారు అనే విషయాలు బయటకు వస్తున్నాయి అని అప్పల నరసయ్య అన్నారు. కృష్ణా నదికి వరదలు రావడానికి కారణం రాధాకృష్ణ కట్టిన పవర్ ప్లాంటే, ఇవన్నీ ప్రజలు తెలుసుకోవాలి పత్రికను అడ్డం పెట్టుకొని వ్యాపార సామ్రాజ్యాన్ని ఏ విధంగా రాధాకృష్ణ అభివృద్ధి చేసుకుంటున్నాడు మనందరం ఆలోచన చేసుకోవాలి అని బొత్స అన్నారు రాధా కృష్ణ పై వెంటనే చర్యలు తీసుకోవాలి లేదంటే భవిష్యత్తులో నీపై చర్య తీసుకునే పరిస్థితి వస్తుంది . మహిళలను కించపరచడం అనేది చిన్న విషయం కాదు చాలా దారుణం . మహిళల్ని ఎవరైనా తప్పుగా మాట్లాడితే వారికి అదే చివరి రోజు అని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెబుతుంటారు . మరి రాధాకృష్ణ విషయంలో అది ఏమైందో చంద్రబాబునాయుడు చెప్పాలి అని బొత్స డిమాండ్ చేశారు .మేము ఆంధ్ర జ్యోతి ఆఫీసులకు వచ్చి శాంతియుతంగా నిరసన తెలియజేస్తూ క్షమాపణ చెప్పమని అడిగాం. అదేదో పత్రికా స్వేచ్ఛను హరించినట్లు రాధాకృష్ణ మాట్లాడుతున్నారు .మేము ఎక్కడ దౌర్జన్యం చేయలేదు శాంతియుతంగా గాంధేయ మార్గంలో నిరసనలు తెలియజేశాం . మరి సాక్షి పేపర్ పై తెలుగుదేశం పార్టీ వాళ్లు ఏవిధంగా దౌర్జన్యం చేసారో అందరికీ తెలుసు. పవన్ కళ్యాణ్ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి పై ధర్నా చేయలేదా అని బొత్స ప్రశ్నించారు ? మీరు ప్రతిపక్షంలో ఉంటే ఒక విధానమా అధికారంలో ఉంటే ఒక విధానమా అని బొత్స ప్రశ్నించారు ? రాధాకృష్ణ మహిళలపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసాం.కానీ వ్యాఖ్యలను రాధాకృష్ణ వెనక్కి తీసుకోనందున రాధాకృష్ణపై పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేయవలసిన పరిస్థితి ఏర్పడిందని బొత్స విలేకరులకు తెలియజేశారు. తప్పనిసరిగా ప్రభుత్వం రాధాకృష్ణ విషయంపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఈ విషయానికి సంబంధించి భవిష్యత్తులో రాధాకృష్ణ భారీ మూల్యం చెల్లించవలసిన బాధ్యత ఏర్పడుతుందని బొత్స అన్నారు . ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల సురేష్ , కరణం ఆదినారాయణ ,జడ్పిటిసి గార తవుడు, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, మాజీ ఎంపీపీ కంది తిరుపతి నాయుడు, రౌతు రాజేశ్వరి ,మాజీ జడ్పిటిసి మంత్రి అప్పలనాయుడు ,వైకాపా నాయకులు బెల్లాన త్రినాధరావు ,మహంతి రమణ , కరి లక్ష్మణ, జగదీష్ ,తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాలు



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం భీమునిపట్నం ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అన్ని అంగన్వాడీ కేంద్రంలో ఏప్రిల్ 9వ తేదీ నుండి 23 వరకు 8వ పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ పక్షోత్సవాలలో క్షేత్రస్థాయిలో పలు అవగాహన కార్యక్రమాలు, సున్నా నుండి రెండు (0-2)సంవత్సరాల పిల్లలు యొక్క మేధావికాసము, అభివృద్ధి, శారీరక ఎదుగుదల మరియు పిల్లలకు మొబైల్ ఫోన్స్ వాడకం వలన కలిగే అనర్ధాలు తల్లి మరియు శిశు పోషణ గూర్చి జంక్ ఫుడ్ తినడం వలన కలిగే నష్టాలు, చక్కెర, ఉప్పు, అధిక కొవ్వు ఉన్నా ఆహారవాడకు తగ్గించుటకై అవగాహన కల్పించుట మరియు పురుషుల యొక్క భాగస్వామ్యం, కుటుంబ సభ్యుల యొక్క భాగస్వామ్యంపై అవగాహన ప్రతి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించబడుతుంది. అందులో భాగంగా గురువారం అర్బన్ హెల్ప్ సెంటర్ భీమునిపట్నం నందు సమావేశం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డా. కళ్యాణ్ చక్రవర్తి, సూపర్వైజర్ బి.నాగమణి, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు హాజరయ్యారు.


## అర్ధరాత్రి తీసుకెళ్లారు .. ధర్నాతో తిరిగిచ్చారు -

మెంటాడ : పది రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో గ్యాస్ సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది లబ్ధిదారుల నుంచి తీసుకుని వెళ్లారు. రోజుల తరబడి ఫోన్లు చేసినా ఏజెన్సీ నిర్వాహకులు స్పందించలేదు. చివరికి ధర్నాతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు దిగొచ్చి, లబ్ధిదారులకు సిలిండర్లు సరఫరా చేశారు. మెంటాడ మండలంలోని ఆంద్ర, లోతుగెడ్డ గ్రామాల్లో పది రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో ఖాళీ గ్యాస్ సిలిండర్లను ఏజెన్సీ సిబ్బంది కలెక్షన్ చేసుకుని వెళ్లారు. గురువారం గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది మినీ వ్యాన్‌లో గ్యాస్ బండలను తీసుకువెళ్తున్నారు. గ్యాస్ బండలను ఇచ్చిన లబ్ధిదారులు ఆంద్ర పోలీస్ స్టేషన్ ఎదురుగా వ్యాన్‌ను అడ్డుకున్నారు.

# నిరుపేద చిన్నారికి పెద్ద కష్టం

ఒక కిడ్నీ పూర్తిగా పాడయింది, మరొక కిడ్నీకి ఇన్ఫెక్షన్ సహాయం కోసం ఎదురు చూస్తున్న చిన్నారి

ప్రజాస్వామ్యం/మక్కువఏప్రిల్ 9: నిరుపేద కుటుంబం లో పుట్టడమే శపమా రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. తల్లి గృహిణి, తండ్రి ప్లాస్టిక్ వ్యర్ధాలు పోగేసి, విక్రయిస్తూ జీవనం సాగిస్తు కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. సాఫీగా జీవితం సాగుతున్న కుటుంబంలో కొద్ది రోజుల క్రిందట కొత్త అలజడి రేగింది. ఒక్కగానొక్క కొడుకు కిడ్నీ సంబంధిత వ్యాధితో తీవ్ర అవస్థలకు గురయ్యాడు. దీంతో ఏమి చేయాలో తెలియక కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. వివరాల్లోకెళ్తే మండల కేంద్రం మక్కువ ఆర్ సి ఎం రెల్లి వీధి కి చెందిన సొండి. రమేష్, నీలిమా దంపతులకు ఒక్కగానొక్క కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొద్దిరోజుల క్రిందట రమేష్, నీలిమ దంపతుల కుమారుడు సొండి.జస్వంత్ (5 సంవత్సరాలు) ఆడుకుంటూ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తల్లిదండ్రులు గమనించి ఓ ప్రైవేటు వైద్యుడికి చూపించడంతో, సంబంధిత వ్యాధి నిర్ధారణ తెలుసుకోవడానికి విశాఖ సెవెన్ హిల్స్ ఆసుపత్రికి రిఫర్ చేశాడు. వెంటనే తల్లిదండ్రులు జస్వంత్ ని సెవెన్ హిల్స్ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రముఖ యురాలజిస్ట్ డాక్టర్ రవికుమార్ పరీక్షించి కిడ్నీ సంబంధిత వ్యాధి ఉందని నిర్ధారించారు. వెంటనే వివిధ పరీక్షలు నిర్వహించగా ఒక కిడ్నీకి ఇన్ఫెక్షన్, మరొక కిడ్నీ పూర్తిగా పాడైపోయిందని గుర్తించారు. ఇన్ఫెక్షన్ అయిన కిడ్నీకి ఆపరేషన్ నిర్వహించేందుకు అధిక మొత్తంలో డబ్బులు అవసరం కావడంతో తల్లిదండ్రులు ఏమి చేయాలో తెలియని స్థితిలో దాతలను వేడుకుంటున్నారు. తమ కుమారుడి పేరు ఆరోగ్యశ్రీలో లేకపోవడంతో ఆపరేషన్ కు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామని, దాతలు స్పందించి తమ కుమారుడిని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.సుమారు రెండు లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపినట్లు వారు వివరించారు. ఒక్కగానొక్క కుమారుడిని కాపాడలేక దీనస్థితిలో ఉన్నామని, సహృదయ దాతలు స్పందించి తమ కుమారుడి ప్రాణాలను కాపాడలని వినయ పూర్వకంగా వేడుకుంటున్నారు. రాష్ట్ర



ప్రభుత్వం స్పందించి తమ కుమారుడి పేరును ఆరోగ్యశ్రీలో చేర్చే విధంగా చర్యలు చేపట్టాలని, దాతల సహాయంతో పాటు, తమ కుమారుడిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని,జస్వంత్ తల్లిదండ్రులు కోరుతున్నారు. దాతలు ఎవరైనా సహాయం చేయాలనుకుంటే 9666016141 ఫోన్ పే నెంబర్, బంగారపు.సుధీర్, బ్యాంకు ఖాతాకు నగదు బదిలీ చేయాలని రమేష్,నీలిమ దంపతులు వేడుకుంటున్నారు.

## సాలూరు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిర్వహిస్తున్నందున విద్యుత్ అంతరాయం

ప్రజాస్వామ్యం /సాలూరు ఏప్రిల్ 9: తేదీ 10/4/2026 అనగా శుక్రవారం సబ్ స్టేషన్ మరమ్మతులు మరియు=ఙూలా పథకం కింద బ్రేకర్ నిర్వహణ పనులు కారణం చేత ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు సాలూరు పట్టణం రైల్వే స్టేషన్ రోడ్డు గుమ్మడం కోటవీధి పెద్ద కోమటిపేట డబ్బి వీధి వెంకటేశ్వర కాలనీ బంగారం పేట బోసుబొమ్మ జంక్షన్ జైపూర్ రోడ్డు రామ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడును మరియు సాలూరు రూరల్ పరిధిలో శివరాంపురం భవానిపురం పారన్నవలస జిగిరాం కుర్మరాజుపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును కావున ప్రజలు సహకరించవలసిందిగా కోరడమైనది. ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె గోపాలరావు.

# పార్వతీపురంను నంబర్ వన్‌గా నిలపడమే లక్ష్యం

## ఉపాధి హామీ పథకం అమల్లో ఉమ్మడి జిల్లా ఫస్ట్-జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి

ప్రజాస్వామ్యం/పార్వతీపురం/ విజయనగరం, ఏప్రిల్ 09 : ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యతతో పనిచేసి, ఇబ్బందులను అధిగమించి జిల్లా అభివృద్ధిలో, నిధుల ఖర్చులో పార్వతీపురాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలుపుతామని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల విషయంలో పాలక పక్షం, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రజలకు చేరాల్సిన పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సర్వసభ్య సమావేశంలో పేర్కొన్నారు. పార్వతీపురం అభివృద్ధికి నిధులు రావడం శుభపరిణామమని, వచ్చిన నిధులను సద్వినియోగం చేస్తూ, పనులను నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం అమలులో ఉమ్మడి జిల్లా మొదటి స్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు.విజయనగరం జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం గురువారం జెడ్పిలో జరిగింది. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేథు మాధవన్, జెడ్పీ సీఈఓ బి.వి.సత్యనారాయణ భాగస్వామ్యం కాగా జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ సమావేశాలు అత్యంత కీలకమని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు




సమన్వయంతో పనిచేసి జిల్లాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గతంలో సభ్యులు లేవనెత్తిన ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు మరియు ఇతర సాంకేతిక సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని, ప్రస్తుతం అవి చాలా వరకు పరిష్కారమై పనులు సజావుగా సాగుతున్నాయని తెలిపారు. తద్వారా రాష్ట్రస్థాయిలో ఉమ్మడి విజయనగరం జిల్లా అత్యుత్తమ పనితీరు కనబరుస్తోందని ఆయన వివరించారు1912 టోల్ ఫ్రీ సేవలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలి జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయి అధికారుల కంటే 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను ఆశ్రయించడం ద్వారా వేగవంతమైన ఫలితాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ఏఈ లేదా ఇతర అధికారులకు సమాచారం అందించే లోపు సమయం వృథా అయ్యే అవకాశం ఉందని, అదే 1912 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేస్తే, అక్కడి నుండి నేరుగా సంబంధిత సిబ్బందికి మెసేజ్ వెళ్లడం ద్వారా పనులు నిర్ణీత సమయంలోగా పూర్తవుతాయన్నారు. అంతేకాకుండా కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు రికార్డు చేయబడుతుందని, కాబట్టి సమస్య పరిష్కారం అయ్యే వరకు దానిని ట్రాక్ చేసే వీలుంటుందన్నారు. కావున ఎక్కడ విద్యుత్ సమస్య తలెత్తినా వెంటనే 1912 నంబర్‌కు కాల్ చేయాలని, ఈ నంబర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులు మరియు ప్రజా ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు.

### నా నిధులను ఎందుకు
## వినియోగించడం లేదు



విజయనగరం: 'నేను కేటాయించిన ప్రభుత్వ నిధులను ఎందుకు ఉపయోగించడం లేదు. ప్రజా సమస్యలు, అభివృద్ధీ మీకు పట్టవా? ఎమ్మెల్యేలతో కలిసి రాజకీయం చేద్దాం అనుకుంటున్నారా?' అంటూ మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకరరెడ్డిపై అరకు ఎంపీ తనూ జారాణి ఫైర్ అయ్యారు. వెంటనే వినియోగిస్తాం అంటూ కలెక్టర్ సమాధానం చెప్తున్నప్పటికీ ఆమె శాంతించలేదు. 'కలెక్టర్ మీ మాటలు, హామీలు వినడానికి నేను ఇక్కడికి రాలేదు. అసలు ఏం జరుగుతుందో, ఎవరు? ఎందుకు అడ్డుకుంటున్నారో, మీరు ఎందుకు స్పందించడం లేదో చెప్పడానికి ఇక్కడికి వచ్చాను అంటూ చురకలు అంటించారు. చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ 'మన్యం కలెక్టర్ గారికి ఎంపీ నిధులు ఉపయోగించడానికి రెండేళ్లు సరిపోవడం లేదు. కానీ, స్వాతంత్ర్యం వచ్చి 76ఏళ్లుదాటినా కొన్ని గిరిజన ప్రాంతాలు రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలకు నోచుకోలేదు. ఇటువంటి పరిస్థితుల్లో నిధుల కోసం వెంపర్లాడి గిరిజనులకు సేవచేయాల్సిన కలెక్టర్ 2024లో 32పనులకు రూ. 2కోట్లు మంజూరుచేసినా వినియోగించలేదు. ఆ తరువాత మరో 40 పనులకు నిధులు కేటాయించినా పట్టలేదు. దీంతో, తనకు ఓట్లేసి గెలిపించిన ప్రజలకు న్యాయం చేయలేక పోతున్నాననే బాధ నన్ను వెంటాడుతోంది' అంటూ ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన చైర్మన్ త్వరలోనే ఎంపీ ఛైర్మన్‌గా ఉన్న దిశ సమావేశం ఏర్పాటు చేయాలని, తద్వారా పనులు ముందుకు సాగించేందుకు చర్యలు తీసుకోవచ్చని అన్నారు. దీనికి ఆమె సమాధానం చెప్తూ అటువంటి సమావేశం మూడు నెలల క్రితమే పెట్టానని, అందులో చెప్పినా కలెక్టర్ పట్టించుకోలేదని, అంతకు ముందు ఫోన్‌లో కూడా సమస్యను విన్నవించానని గుర్తుచేశారు. నిధులు విడుదల చేయడం చాలా సంతోషమని, వెంటనే వినియోగంలోకి తెస్తామని కలెక్టర్ చెప్పగా, తాను మాటలు వినడానికి సిద్ధంగా లేనని, ఆ నమ్మకం, ఓపిక నశించిందని, ఏదైనా పనిచేసి చూపించుకోవాలని అన్నారు.

### వంగర ప్రాథమిక ఆరోగ్య
## కేంద్రంలో పోషణ పక్వాడ

పలు అంగన్వాడి కేంద్రాల్లో పోషన పక్వాడ కార్యక్రమం నిర్వహన



.వంగర,: ఎనిమిదవ పోషన్ పక్వాడా 23వ తేదీ వరకు నిర్వహించబడునని వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్లు. సిహెచ్ నూకాలమ్మ. మేరీ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ శిశువు యొక్క పోషణ జీరో నుండి మూడు సంవత్సరాల పిల్లలు వరకు మెదడు అభివృద్ధి చెందాలంటే ఆట, పాటలుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యంగా చిరుధాన్యాలులో గల విటమిన్లు ప్రోటీన్లు. ఖనిజ లవణాలు ఎక్కువగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దయానా. డాక్టర్. ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ చిరుధాన్యాలు అలాగే పండ్లు, పాలు విటమిన్ తో కూడుకున్న పదార్థాలు ఎక్కువగా తీసుకుంటే రక్తంఅభివృద్ధి చెంది రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలో శివ్వాం1 , మద్దువలస , జగన్నాధవలస, వంగర ,వన్ టూ త్రీ, వాణి అగ్రహారం, సంగాం, పట్టు వర్ధనం, వన్ రుషింగి, వన్.. టూ అంగన్వాడి కేంద్రాలు. తలగాం1, 2 అంగన్వాడి కేంద్రంలో గురువారం అంగన్వాడీ కార్యకర్తలు పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు. షావుకారి మీనా కుమారి, మొగిలి తిరుమలకుమారి, పొదిలాపు భారతి, బి.దమయంతి, టి శశికళ, పి.వెంకటరత్నం, సాకేటి కుమారి, సత్యవతి గౌరీశ్వరి, లలిత, విజయలక్ష్మి, టి రవణమ్మ, వి. అప్పన్న, సిహెచ్ అప్పల నరసమ్మ, కళావతి, గజలక్ష్మి, విజయభారతి పాల్గొన్నారు.

### ఏప్రిల్ 9 నుండి 23 ఏప్రిల్ వరకు
## 8వ పోషణ పక్వాడా కార్యక్రమలు: సి డి పి ఓ అనంతలక్ష్మి



ప్రజాస్వామ్యం/ పాచిపెంట ఏప్రిల్ 9: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 9 నుండి 23 ఏప్రిల్ వరకు 8వ పోషణ పక్వాడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సిడిపిఓ అనంతలక్ష్మి పత్రికా ముఖంగా తెలిపారు. ఈ సందర్భంగా పిఓ అనంతలక్ష్మి మాట్లాడుతూ థీమ్ పిల్లలు జీవితం లో మొదటి 6 సంవత్సరాలలో మెదడు అభివృద్ధిని గరిష్ట స్థాయి కి చేర్చడం" అనేది ముఖ్యం ఉద్దేశ్యం.అందులో భాగంగా ఈరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పాచిపెంట మరియు +చీ పేట నందు అక్కడకి వచ్చిన .గర్భిణీలు తీసుకోవలసిన,, ఆహారం,, ఆరోగ్యం, రక్తహీనత గురించి,,1000 రోజులు సంరక్షణ,తల్లి బిడ్డ ఆరోగ్యం, నవజాత శిశువు సంరక్షణ, పరిశుభ్రత లు గురించి, తెలియచేయ్యడం జరిగింది.గర్భిణీలు,శివకుమార్ డాక్టర్ గారు, పాచిపెంట డాక్టర్ హరిత గారు ఆరోగ్య సిబ్బంది, జఘెట చీ+టా నుండి ప్రాజెక్ట్ అస్సోసియేట్ విజయ్ గారు, ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### జాయింట్ కలెక్టర్ సి. యస్వంత్ కుమార్ రెడ్డి




ప్రజాస్వామ్యం/?కురుపాంఏప్రిల్ 09: ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, విధి నిర్వహణలో ఏమాత్రం అలసత్వం వహించినా సహించేది లేదని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ సి. యస్వంత్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన కురుపాం మండలం, పొడి గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారునిర్లక్ష్యంపై ఆగ్రహం, మెమోల జాతనిఖీలో భాగంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై జాయింట్ కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యార్థుల ఎగ్జామ్ వర్క్ బుక్స్‌ను ఉపాధ్యాయులు సరిగా మూల్యాంకనం చేయకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. విద్యార్థులు చేసిన తప్పులను గుర్తించి, వారికి వివరించడంలో ఉపాధ్యాయులు విఫలమయ్యారని మండిపడ్డారు. ఈ క్రమంలో, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన హెడ్ మాస్టర్లు, ఉపాధ్యాయులకు ప్రాజెక్ట్ ఆఫీసర్ ద్వారా చార్జ్ మెమోలు జారీ చేశారుపరిశుభ్రత, నిర్వహణపై ఆదేశాలపాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత లోపించడం, స్టోర్ రూమ్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పాఠశాల వాతావరణాన్ని మెరుగుపరచాలని, వర్క్ బుక్స్‌ను క్రమం తప్పకుండా పరిశీలించి విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేయాలని అధికారులను ఆదేశించారుఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారులు, మండల రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాలూరులో వార్డుకో వాటర్ ట్యాంక్

. ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి సంధ్యారాణి



సాలూరు, : సాలూరు మున్సిపాల్టీలో అన్ని వార్డుల్లో వాటర్ ట్యాంకులు పెడతామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఈమేరకు గురువారం వార్డుకో వాటర్ ట్యాంకులో భాగంగా 2,3,5,6,19 వార్డుల్లో ఒక్కో ట్యాంక్ కు 1.80 లక్షల వ్యయంతో మొత్తం 12.60 లక్షలు వెచ్చించి వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసారు. ఈసంధర్భంగా ప్రతి వార్డులో మంగళ వాయిద్యాలతో, మేళతాళాలతో మంత్రి ప్రజలు మంత్రి సంధ్యారాణికి స్వాగతం పలికారు. వార్డుకో వాటర్ ట్యాంక్ పండగ వాతావరణం మధ్య ప్రారంభమయ్యాయి. ఈసంధర్భంగా మంత్రి మాట్లాడుతూ అవసరమైతే మరిన్ని వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ప్రజలకి తెలిపారు.

# చిప్పాడ దివిస్ లేబరేటరీస్ లో మెగా రక్తదాన శిబిరం



భీమునిపట్నం,ప్రజాస్వామ్యం దివిస్ జనరల్ మేనేజర్ చంద్ర దివి ఆశయాలకు అనుగుణంగా ఆయన జయంతిని పురస్కరించుకొని ఉత్తరాంధ్ర జిల్లాల రక్తనిధి కేంద్రాల పర్యవేక్షణలో సుమారు 1000 యూనిట్ల రక్తాన్ని సేకరిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం దివిస్ లేబరేటరీస్ చంద్ర దివి 56వ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని సంస్థ ఉపాధ్యక్షులు ఎల్వి రమణ ప్రారంభించారు. దివిస్ లేబరేటరీస్ జనరల్ మేనేజర్లు వైయస్ కోటేశ్వరరావు, ఈ.రామకృష్ణ, పున్నారావు, ప్రద్యుమ్న లతో కలిసి స్వర్గీయ చంద్ర దివి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదానం రక్త నిధి కేంద్రాల పర్యవేక్షణలో ఏళ్ల తరబడి సామాజిక బాధ్యతలో భాగంగా విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం చిప్పాడ లో దివిస్ లేబొరేటరీస్ లిమిటెడ్ సంస్థ నిరంతరాయంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి సేవలందిస్తోంది. ఈ రక్తదాన శిభిరం లో మహిళా ఉద్యోగినులు కూడా మేము సైతం అంటూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చి మరెంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎన్టీఆర్, ఇండియన్ రెడ్ క్రాస్, ఎస్ రాజా, రోటరీ క్లబ్, లైఫ్ షేర్, విశాఖ ఎన్విఎన్, ఉత్తరాంధ్ర జిల్లాల రక్తనిధి కేంద్రాల పర్యవేక్షణలో దాతలు నుండి రక్తాన్ని సేకరించారు. సుమారు 1000 నుండి 1300 మంది ఉద్యోగులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్త దానం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు ఎల్వి రమణ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఏదో విధంగా సహాయ పడాలని చంద్ర దివి లక్ష్యసాధనకు నిరంతరాయంగా సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా కృషి చేస్తుందన్నారు. చంద్ర దివి ప్రారంభించిన రక్తదాన శిబిరాన్ని గత 23ఏళ్లుగా కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.జగదీష్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు గోపీనాథ్, చంద్రశేఖర్, శిబిరం ఆర్గనైజర్ దివిస్ ప్రతినిధి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## యువతా జాగ్రత్త గంజాయిజోలికి పోవద్దు

. గంజాయి రవాణ, విక్రయాలు, వినియోగానికి యువత దూరంగా ఉండాలని పిలుపు
. యువత మేలుకోరి, చట్టాల తీవ్రతపై అవగాహన




విజయనగరం: ఎవరైనా గంజాయితో పట్టుబడితే ప్రస్తుతం అమలులో ఉన్న కఠిన చట్టాలతో జీవితాలు నాశనమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. యువత గంజాయి రవాణ, విక్రయాలు, వినియోగం వంటి వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రస్తుతం గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు కఠిన చర్యలు చేపడుతూ, చట్టాలను కూడా కఠినతరం చేసారన్న విషయాన్ని యువత గుర్తించాలన్నారు. చట్టాలు ఎంత కఠినంగా మారాయంటే, హత్య చేసిన వ్యక్తికి న్యాయస్థానాలు 12సం.లు వరకు శిక్ష విధిస్తే, గంజాయి అక్రమ రవాణాకు పాల్పడి, పోలీసులకు పట్టుబడిన వారికి మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం ప్రకారం 20సం.లు వరకు శిక్ష పడుతుందన్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడడం అన్నది ఎంత తీవ్రతరమైన నేరమన్న విషయాన్ని యువత గ్రహించాలన్నారు. గంజాయి కేసుల్లో ఎక్కువగా యువతే పట్టుబడుతూ, జైళ్ళలో మగ్గుతున్నారన్నారు. గంజాయి కేసుల్లో న్యాయస్థానాలు కూడా యువత చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు అలవాటుపడి, తాత్కాలిక ఆనందం కోసం గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటుపడి అవసరాలకోసం అక్రమదారుల్లో ప్రయాణిస్తూ జైలుపాలవుతున్నారని ఎస్పీ దామోదర్ తెలిపారు.

# తిమ్మాపురం లో రొయ్యల సాగు పైఎన్ఎస్పిఏడి బృందం అవగాహన

భీమునిపట్నం, ప్రజాస్వామ్యం రొయ్యల సాగు పై భీమిలి మండలం, తిమ్మాపురం గ్రామంలో గురువారం ఎన్ఎస్పిఏడి బృందం క్షేత్ర సందర్శన చేసారు. మత్స్యశాఖ ప్రిన్సిపల్ అండ్ అదనపు డైరెక్టర్ డా. ఎస్. అంజలి ఆదేశాల మేరకు, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ కె. శ్రావణి కుమారి పర్యవేక్షణలో పి. లక్ష్మణరావు (జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, విశాఖపట్నం) ఆధ్వర్యంలో, నేషనల్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ ఫర్ అక్వాటిక్ యానిమల్ డిసీజెస్ (ఎన్ఎస్పిఏడి) బృందం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో చేపల మరియు రొయ్యల సాగులో వ్యాధుల పర్యవేక్షణ మరియు నివారణపై ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ఈ ఫీల్డ్ విజిట్‌లో భాగంగా సీడ్ ప్రొడక్షన్‌లో కీలకమైన హ్యాచరీలను సందర్శించి, నమూనాలను సేకరించారు.ఈ సందర్భంగా రైతులకు రొయ్యల సాగులో స్క్రీనింగ్ యొక్క ప్రాముఖ్యత, ముఖ్యంగా ఓఐయి జాబితాలో ఉన్న వ్యాధులను ముందస్తుగా గుర్తించడం ఎంత ముఖ్యమో వివరించారు. వ్యాధుల నియంత్రణలో స్క్రీనింగ్ కీలక పాత్ర పోషిస్తుందని, ఆరోగ్యకరమైన సీడ్ వినియోగం ద్వారా వ్యాధి



వ్యాప్తిని తగ్గించవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్. ఈశ్వర్ రాజు (ఫిషరీస్ డెవలప్మెంట్ ఆఫీసర్) తదితరులు పాల్గొన్నారు.

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET-PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022